ఓట్ల లెక్కింపులో పొరపాట్లు జరగొద్దు : ఆర్‌ఒ

ప్రజాశక్తి-మదనపల్లి

కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని మదనపల్లె ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరి ప్రసాద్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మదనపల్లె నియోజకవర్గ కౌంటింగ్ అధికారులకు పలు సలహాలు, సూచనలు, కౌంటింగ్ ప్రక్రియపై ఆర్‌ఒ అవగాహన కల్పించారు. అనంతరం అధికారుల విధివిధానాలపై శిక్షణ తరగతులను నిర్వహించి మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌ఒ హరిప్రసాద్

టెన్షన్..టెన్షన్..!

- వైసిపి నేతల్లో ఉత్కంఠ
- గెలుపు ధీమాతో టిడిపి
- కౌంటింగ్ కోసం నిరీక్షణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నిక నరాలు తెగే ఉత్కంఠ కలిగిస్తోంది. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వ్యూహంలో భాగమైన ఎన్నికల ప్రచారాలు, ప్రలోభాలు, ద్వితీయశ్రేణి నాయకుల ఫిరాయింపులు వంటి అంశాల్లో ప్రత్యర్థులపై పైచేయి సాధించిన అభ్యర్థుల్లో ధీమా వ్యక్తమవుతోంది. వైఎస్ఆర్ జిల్లాలో పెద్దఎత్తున పోలింగ్ శాతం నమోదు కావడం ఉత్కంఠను కలిగిస్తోంది. ఓటర్లలో చైతన్యస్థాయి పెరగడం, ప్రధాన పార్టీల అభ్యర్థుల డబ్బు పంపిణీ తదితర అంశాలు కారణాలుగా నిలుస్తుండడం తెలిసిందే. మహిళలు, వృద్ధులు, యువత పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. కడపలోని గౌస్‌నగర్ తదితర పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు పోలింగ్‌లో పాల్గొనడం సార్వత్రిక ఎన్నికల తీవ్రతకు అద్దం పట్టింది. హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, మహారాష్ట్ర నగరాల నుంచి సాఫ్ట్‌వేర్‌లు, వ్యాపారులు, ఇతర ఉద్యోగులు పెద్దఎత్తున వచ్చి ఓటింగ్‌లో పాల్గొనడంతో ఓటింగ్ పతాకస్థాయికి చేరుకుంది. కడప అసెంబ్లీలో గత సార్వత్రిక ఎన్నికలకు మించి ఓటింగ్ శాతం నమోదు కావడం గమనార్హం.

అందరి చూపూ కౌంటింగ్‌పైనే

జూన్ నాలుగవ తేదీన నిర్వహించనున్న కౌంటింగ్‌పైనే అందరి చూపూ నిలిచింది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు మొదలుకుని స్థానిక సంస్థల ప్రతినిధులు, బెట్టింగ్ రాయుళ్లు, కార్యకర్తలు, ప్రజలందరిలో ఉత్కంఠను కలిగిస్తోంది. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి కూటమి అభ్యర్థులు ఎవరి గెలుపు వారు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ యూరప్ పర్యటనకు వెళ్తుండగా సోషల్‌మీడియా విభాగానుద్దేశించి 151 సీట్లు గెలుస్తామని సంకేతాలు ఇవ్వడంతో వైసిపి శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం తొణికిస లాడుతోంది. ఇందుకు కొనసాగింపుగా జూన్ తొమ్మిదిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తుండడం గమనార్హం. విశాఖలో పలు హోటళ్లు..గెస్ట్‌హౌస్‌లు హౌస్‌ఫుల్‌గా మారాయనే వార్తలు వినిపిస్తున్నాయి. వైసిపి హడావుడిని గమనించిన కూటమి నేతలు గుంభనంగా వ్యవహరిస్తున్న వాతావరణం కనిపిస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం కౌంటింగ్ ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేస్తున్నారు. రాజకీయ పార్టీలు సైతం తమకు నమ్మకమైన ఏజెంట్లను నియమించుకునే పనిలో నిమగ్నం కావడం గమనార్హం.

సార్వత్రిక ఎన్నికలు ఉత్కంఠను కలిగిస్తున్నాయి. ఈ నెల 13 నాటి పోలింగ్ వైసిపి, టిడిపి మధ్య నువ్వానేనా అనే రీతిలో నడిచింది. పోలింగ్ జరిగిన తీరు అధికార, ప్రతిపక్ష పార్టీల ఎవరి ధీమా వారిదిగా మారింది. రాష్ట్రంలో టిడిపి కూటమి గెలుపుపై పెద్ద ఎత్తున పందేలు సాగుతున్న నేపథ్యంలో టిడిపిలో ఉత్సాహం తొణికిసలాడుతోంది. జగన్ వైసిపికి 151 సీట్లు ఖాయమని సోషల్ మీడియా విభాగాన్ని కలిసిన సందర్భంగా పేర్కొనడం తెలిసిందే. వైసిపి గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తోంది. జూన్ తొమ్మిదిన విశాఖలో వైసిపి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యం గెలుపుపై ధీమాను కలిగిస్తోంది. కూటమి రాష్ట్ర నాయకత్వం విజయం తమదే నంటూ గుంభనంగా వ్యవహరిస్తుండడంతో ఎవరి ధీమా వారిదిగా మారింది. పోలింగ్‌లో మధ్యాహ్నం నుంచి మహిళా ఓటర్లు పోటెత్తడం, పోలింగ్ శాతంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జూన్ నాలుగు వరకు ఉత్కంఠభరిత పరిస్థితి కొనసాగనుంది.

కౌంటింగ్‌కు పూర్తి స్థాయిలో సన్నద్ధం : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ఇటిపిబిఎస్, ఎన్ కోర్‌లపై ఇచ్చిన శిక్షణతో కౌంటింగ్‌కు పూర్తి స్థాయిలో సన్నద్ధం అవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ రావు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని స్పందన హాల్‌లో ఇటిపిబిఎస్, ఎన్ కోర్ వెబ్సైట్‌లో డేటా ఎంట్రీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటిపిబిఎస్ ఓట్లను లెక్కించే విధానం, ఎన్ కోర్ వెబ్ సైట్‌ను ఉపయోగించే విధానంపై ఇచ్చిన శిక్షణతో కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం అవ్వాలని పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు ఉండకూడదని తెలిపారు. అనంతరం ఐటి అప్లికేషన్స్ నోడల్ ఆఫీసర్ హరికృష్ణ, ఇటిపిబిఎస్‌కు సంబంధించిన వివిధ ఫారములు వాటి మీద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసే విధానం, వంటి వివిధ అంశాలను కౌంటింగ్ సిబ్బందికి వివరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ క్రాంతి కుమార్ ఎన్ కోర్ వెబ్సైట్‌లో డేటా ఎంట్రీపై శిక్షణను ఇచ్చారు. అనంతరం కౌంటింగ్ సిబ్బంది నుంచి వచ్చిన వివిధ అనుమానాలను హరికృష్ణ, క్రాంతి కుమార్‌లు నివృత్తి చేశారు. శిక్షణ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారులు డిపిఒ ధనలక్ష్మి, ఎపిఎంఐపి పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపుపై అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి హరికృష్ణ

ఆ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

విద్యా శాఖాధికారి ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహ అన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి, ఇష్టారాజ్యంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యం ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం టెక్నో, ఈటెక్నో వల్ల బ్యాంక్ కాన్సెప్ట్ ఐఐటి జెఇఇ మెయిన్స్, నీట్ వంటి పేర్లతో విద్యను వ్యాపారం చేయొద్దని ప్రభుత్వం పదే పదే చెబుతోందని పేర్కొన్నారు. ఆయా విద్యా సంస్థలు, విద్యాశాఖ అధికారుల ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయకుండా ధనార్జన ధ్యేయంగా విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్న కళ్ళుని చూడలేని చెవులు ఉండి వినలేని పరిస్థితిలో విద్యాశాఖ అధికారులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యాపారం మాఫియాని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలం చెందారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏమో పేరు గొప్ప ఊరు దిబ్బ తప్ప మరేం లేదన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థి సంఘాలు పదేపదే అలాంటి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని చెప్తున్నా ఏ పాఠశాలకు అనుమతులు లేవని ముందుగానే ప్రకటన చేసే పరిస్థితులలో మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు గాని లేకపోవడం చాలా దారుణమని పేర్కొన్నారు. నారాయణ, శ్రీ చైతన్య, భాష్యం విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఇతర విద్యా సంస్థలు అడ్మిషన్లు ఫుల్ అయ్యాయని బోర్డు పెట్టేసారని గుర్తు చేశారు. అడ్మిషన్ ఫీజు రూ.3500 నుండి రూ.ఆరు వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. ఎల్‌కెజి విద్యార్థికి రూ.26 వేలు ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. తమ పాఠశాలలోనే బుక్స్, యూనిఫామ్, షూస్, టై, బెల్టు ఇతర అన్ని రకాల మెటీరియల్ తీసుకోవాలని నిబంధన పెట్టారన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచిత నిర్బంధ విద్య అందించాలని నిబంధన ఉన్న జిల్లాలో ఏ ఒక్క పాఠశాలలో కూడా అమలు జరగడం లేదన్నారు. ఫీజు నియంత్రణలో చట్టం ప్రతి పాఠశాలలో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి విద్యా సంస్థలపై తనిఖీలు నిర్వహించాలని కోరారు. జిల్లాలో సిబిఎస్‌ఇ అనుమతి లేక పోయిరా ఉనట్టు ప్రచారం చూసుకుంటూ పెద్ద ఎతున్న వేల రూపాయిలు ఫీజులు వసూలు చేస్తున్నాని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలా లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయచోటి టౌన్ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

సంబేపల్లె ఆర్‌బికెలో విత్తన తూకాలు పరిశీలిస్తున్న చంద్రనాయక్

ప్రజాశక్తి రాయచోటి

జిల్లాలో బుధవారం నుంచి వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్ర నాయక్ అన్నారు. సంబేపల్లి మండలంలోని నారాయణరెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ కాయలు స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో ఇప్పటి వరకు పేర్లు నమోదు చేసుకున్న రైతులందరూ వేరుశనగ విత్తన కాయలు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. అన్ని ఆర్.బి.కెలలో వేరుశనగ కాయలను సరఫరా చేస్తామని తెలిపారు. కె-6 రకం 35323 క్వింటాళ్లు, నారాయణి 18046 క్వింటాళ్లు, టిసిజిఎస్ 900 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి 1114 క్వింటాళ్లు జిల్లాకు వచ్చాయని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు వేరుశనగ విత్తన కాయల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, నాణ్యత సరిగా లేని కాయల లోడును వెంటనే వెనక్కి పంపించాలని తెలిపారు. వేరుశనగ విత్తన కాయల నాణ్యతపై రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని పేర్కొన్నారు. విత్తన కాయల నాణ్యతలో అధికారులు ఎవరైనా అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు తమ పరిధిలోని ఆర్‌బికెల్లో విత్తన కాయలు తీసుకోవాలని తెలిపారు.

'ఉపాధి' పనులు సద్వినియోగం చేసుకోవాలి : ఎపిడి

ప్రజాశక్తి-పీలేరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కలికిరి ఎపిడి నందకుమార్‌రెడ్డి, పీలేరు ఎపిఒ ఎద్దుల మహేష్ తెలిపారు. మండలంలోని తలుపుల, మేళ్ల చెరువు పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వారు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సంద ర్భంగా వారు ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ఉపాధి హామీలో చిన్న నీటి కుంటలు, పెద్ద నీటి కుంటలు, ఫారంపండ్లు, మామిడి మొక్కల పెంపకం, ట్రెంచ్ లు, ఏటవాలు ప్రాంతాల్లో కందకాల తవ్వకాలు, పశుగ్రాస పెంపకం లాంటి పనులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అవకాశం ఉన్న రైతులు, కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకుని నగరాలకు వలస వెళ్లే పరిస్థితి రానీయకుండా ప్రభుత్వం విరివిగా ప్రతి ఒక్క కూలీకి ఉపాధి హామీ పని కల్పిస్తూందని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకే కూలి డబ్బులు ప్రభుత్వం నుండి బదిలీ చేయడం జరుగుతుందని చెప్పారు. దళారు లతో పనిలేకుండా కూలీల కష్టం కూలీలకే అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది కూలీలకు నిబంధనల మేరకు తగిన వసతులు కల్పించాలని, అదేవిధంగా పనులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎలాంటి అవకతవకలు జరిగినా, తాము గుర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నందకుమార్‌రెడ్డి

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ప్రాంగణ ఎంపికల్లో 27 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 27 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బెంగళూరుకు చెందిన రైనెక్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ఆన్ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా తమ కళాశాలలో చదువుతున్న విద్యా ర్థులకు, వారు డిగ్రీ చదువుతుండగానే ఉద్యోగ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది ఆన్ క్యాంపస్ నిర్వహించడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులు రూ.5.2 లక్షల వార్షిక వేతనంతో కూడిన నియామక పత్రాన్ని కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ చేతుల మీదుగా అందుకున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ లావణ్య, మహేష్, రైనిక్స్ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ శ్రీదత్, ప్లేస్మెంట్ ఆఫీసర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొడుతున్నారు

ప్రజాశక్తి- కడప అర్బన్

పది ఏళ్ల కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజలకు ఏ ఒక్క మంచి పని చేయలేదని, ప్రాజెక్టులు, పరిశ్రమలు నెలకొల్పలేదని చివరికి పోలవరం ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని ఎఐటియుసి కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి. విమర్శించారు. మంగళవారం స్థానిక హోచిమన్ భవన్‌లో ఎఐటియుసి కడప నగర ఆఫీస్ బేరర్స్ సమావేశం నగర ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దె మద్దిలేటి.మాట్లాడుతూ ప్రదాని నరేంద్రమోడీ ప్రజలను మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని వాపోయారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ప్రజలను మభ్యపెట్టడానికి పచ్చి అబద్దాలు ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులాన్ని, మతాన్ని ఉపయోగించి ఓట్లు పొందాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. సమావేశంలో ఎఐటియుసి కడప నగర ఆఫీస్ బేరర్స్ లింగన్న, ఆర్.బాబు, నాగిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో 33/11 కెవి గవర్నమెంట్ హాస్పటల్ సబ్‌స్టేషన్ పరిధిలో, 11 కెవి గవర్నమెంట్ హాస్పిటల్ ఫీడర్, 33/11 కేవీ కోతి సమాధి సబ్ స్టేషన్ పరిధిలో, 11 కెవి పార్లపల్లి రోడ్డు ఫీడర్ పరిధిలో చెట్లు, మొక్కలు తొలగిస్తున్నందున బుధవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ జెఇ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైవీయూ డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల బిఎ, బిబిఎ, బికాం, బిఎస్‌సి 6వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. మంగళవారం విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌లో వైవీయూ విసి ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎస్.ఈశ్వర్ రెడ్డితో కలిసి పరీక్ష ఫలితాల గణాంకాలను పరిశీలించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి ఆచార్య సుధాకర్ మాట్లాడుతూ బిఎ లో 658 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా అందరూ ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. బిబిఎలో 249 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ రెండు కోర్సులలో 100 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. బికాంలో 4,012 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3,947 మంది (98.38 శాతం)ఉత్తీర్ణత పొందారని తెలిపారు. బిఎస్‌సిలో 3,721 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,681 మంది(98.93 శాతం) ఉత్తీర్ణులు అయ్యారని వివరించారు. డిగ్రీ పరీక్షలు గత నెలలో మొదలై ఈనెల 24 వరకు జరిగాయని తెలిపారు. త్వరితగతిన పరీక్షా ఫలితాలు వెల్లడయ్యేందుకు కృషిచేసిన వైవీయూ పరీక్షల విభాగాన్ని అభినందించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ సహాయ అధికారి డాక్టర్ గంగయ్య పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల చేస్తున్న విసి సుధాకర్

ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను రద్దు చేయాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి- కడప అర్బన్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేదనే కారణంగా జిల్లాలోని 163 మంది ఉపాధ్యాయులకు జారీచేసిన ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో డిఇఒ ఎం.అనురాధకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఫ్యాప్టో జిల్లాశాఖ ఆధ్వర్యంలో డిఇఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్ మాట్లాడుతూ 163 మంది ఉపాధ్యాయులతోపాటు ఎన్నికల శిక్షణ తరగతులకు హాజరు కాలేదని కారణంగా మరో 18 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. తీవ్రమైన అనారోగ్య కారణాల చేత మాత్రమే హాజరు కాలేకపోయారని, అంతే తప్ప కలెక్టర్ ఉత్తర్వులను ఉల్లంఘించాలనే ఆలోచనతో మాత్రం కాదని వివరించారు. తీవ్రమైన అనారోగ్య కారణాల చేత ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుల పట్ల జిల్లా అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో చక్కగా ఎన్నికల విధులు నిర్వహించిన కలెక్టర్‌కు, అధికారులకు ఫ్యాప్టో పక్షాన అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎస్.ఇలియాస్ బాష, కె.ఖాదర్ బాష, పాలెం మహేష్ బాబు, కె.రాజశేఖర్, కె.నరసింహారావు, సి.వి.రమణ పాల్గొన్నారు.

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీ జరగనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదని, అలా ఎవరైనా గొడవలకు ప్రయత్నిస్తే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వాల్మీకిపురం సిఐ పులిశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి, మేకలవారిపల్లి, పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో బిఎస్ఎఫ్ బలగాలు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బందితో కలసి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి కృష్ణారావు ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళి, నిబంధనలను అనుసరించి ఎన్నికల తర్వాత, ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా నివారణా చర్యలో భాగంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కావున ప్రజలెవ్వరూ గుంపులుగా చేరడం, ఊరేగింపులు నిర్వహించడం, సంబరాలు చేయడం, బాణా సంచా కాల్చడం, బాణా సంచా విక్రయించడం నిషేదమన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, పోలీసుల హెచ్చరికలను పాటించి, తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాగేశ్వర రావు, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్‌ను వాయిదా వేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఈనెల 29న నిర్వహించే స్కూల్ కాంపోజిట్ గ్రాంట్స్ ఆడిట్‌ను వాయిదా వేయాలని యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. మంగళవారం డిఇఒ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు, జూన్ 4న కౌంటింగ్, ప్రధానోపాధ్యాయుల శిక్షణ తరగతులను దృష్టిలో ఉంచుకుని స్కూల్ కాంపోజిట్ గ్రాంట్స్ ఆడిట్ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. పై రెండు కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు కచ్చితంగా పాల్గొనాల్సి ఉన్నందున ఆడిట్ కు హాజరు కావడం సాధ్యం కాదని పేర్కొన్నారు. స్పందించిన డిఇఒఎన్నికల కౌంటింగ్ శిక్షణ తరగతులకు హాజరయ్యే ప్రధానోపాధ్యాయులకు ఆడిట్ నుంచి మినహాయింపు కల్పించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళదామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ పాల్గొన్నారు.

ప్రారంభ మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలోని కెఎస్ఆర్ఎం, కెఒఆర్ఎం క్రికెట్ మైదానాలలో మంగళవారం ప్రారంభమైన ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మెన్స్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్లో అనంతపూర్ జట్టుపై 5 వికెట్ల తేడాతో కడప జట్టు విజయం సాధించింది. వేరొక మ్యాచ్లో చిత్తూరు జొట్టుపై 4 వికెట్ల తేడాతో కర్నూలు జట్టు విజయం సాధించింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. కడప జట్టు కు చెందిన ఎం.హరిశంకర్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు. 209 పరుగుల విజయ లక్ష్యంతో అనంతరం బ్యాటింగ్కు దిగిన కడప జట్టు బాగా ఆడుతున్న సమయంలో మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడడంతో అంపైర్లు ఓవర్లను కుదించి విజయ లక్ష్యాన్ని 191 పరుగులకు చేశారు. 191 పరుగుల విజయ లక్ష్యాన్ని కడప జట్టు సాధించి ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కడప జట్టుకు చెందిన జహీర్ అబ్బాస్ 50 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్నిత 50 ఓవర్లలో 9 వికెట్లను నష్టానికి 273 పరుగులు చేసింది. అనంతరం 274 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 47.5 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 274 పరుగులు సాధించి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

50 పరుగులు చేసిన జహీర్ అబ్బాస్

5 వికెట్లు తీసిన హరిశంకర్

ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబును దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రామసముద్రం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించారని రామసముద్రం పోలీసులకు టిడిపి వర్గీయులు ఫిర్యాదు చేశారు. మండలంలోని చెంబకూరు పంచాయతీకి చెందిన చంద్రశేఖర్ అనే గ్రామ స్థాయి వైసిపి నాయకుడు చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించిన ఒక వీడియో సోమవారం రాత్రి నుంచి సోషల్ మీడియాలో, సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచారం కావడంతో టిడిపి రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు మంగళవారం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో వీడియోలో వైసిపి నాయకుడు మాట్లాడిన మాటలను సుమోటోగా తీసు కొని కేసు నమోదు చేయాలని ఎస్ఐ చంద్రశేఖరకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

ప్రజాశక్తి-రామాపురం

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో రైతులు తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించి ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలను పొందాలని మేనేజర్ కె.మంజుల పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే క్రాప్ లోన్ రెన్యువల్ యధావిధిగా జరుగుతున్నాయని అన్నారు. అర్హులందరూ తాను తీసుకున్న పంట రుణాల తేదీని గుర్తుపెట్టుకుని సంవత్సర తేదీకి ఒకరోజు ముందుగా వడ్డీ చెల్లించాల్సి వస్తుందని ఆమె తెలిపారు. పంట రుణాల చెల్లింపు గడువు తేదీని జ్ఞాపకం చేసుకుని తేదీ కన్నా ముందు ఒకరోజు రెన్యువల్ చేయాలని రెన్యువల్ చేసే రోజు ఆదివారం కానీ, రెండవ శనివారం కానీ, నాలుగో శనివారం కానీ ప్రభుత్వ బ్యాంకు సెలవులు గుర్తించుకుని ఒకరోజు ముందే బ్యాంకుకు వచ్చి రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు గ్రామాల్లోని ఖాతాదారులు ఆయా గ్రామాలకు సంబంధించిన బిజినెస్ కరస్పాండెంట్ ద్వారా విషయం తెలుసుకొని సకాలంలో చెల్లించాలని తెలిపారు. ఖాతాదారులకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం, ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకాలు ఒక వరం లాంటివని రామాపురం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కె.మంజుల అన్నారు. బ్యాంకులో అకౌంట్ కలిగిన ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద సంవత్సరానికి రూ.20లు, ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన క్రింద రూ.436లు చెల్లిస్తే రెండు లక్షల రూపాయల బీమా పొందవచ్చని ఆమె తెలిపారు. ఖాతాదారులు తమ ఖాతాలో కనీస నిలువలను ఉంచుకోవాలని సూచించారు.

నేడు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని రైతులకు నేడు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార ఆధారంగా రైతులు వేరుశనగ పంటను సాగు చేయడానికి ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న వేరు శెనగ విత్తన కాయలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 10 పంచాయతీల పరిధిలోని 12 రైతు భరోసా కేంద్రాలకు కె6 (తెల్లరకం)-500 క్వింటాలు, నారాయణి-1100 క్వింటాలు మొత్తం 1600 క్వింటాల వేరుశనగ విత్తన కాయలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కే6- ఒక్కో బస్తా రూ.1710లు, నారాయణి రూ.1746లు 40 శాతం సబ్సిడీ ధరకు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. విత్తనాల కొరకు పర్మిట్లు పొందిన రైతులందరూ ఆర్‌బికె కేంద్రాలకు వెళ్లి వేరుశనగ విత్తన కాయలను పొందా లన్నారు. భూమి సారవంతం కొరకు మండలానికి 120 క్వింటాల పచ్చిరొట్ట విత్త నాలు కేటాయించడం జరిగిందన్నారు. 50 శాతం సబ్సిడీపై కిలో రూ.88లు చొప్పున ఒక్కో బస్తా రూ.440లకు ఇవ్వడం జరుగుతుందని, అవసరమున్న రైతులు ఆర్‌బికెలో పొంద వచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'ఉద్యాన పాలిటెక్నిక్'లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి

ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశానికి ఆన్లైన్ దరఖాస్తులు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ బయ్యన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఉద్యాన పాలిటెక్నిక్ ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సు ప్రవేశాల కొరకు పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సు అభ్యసించడానికి ఆన్‌లైన్ దరఖాస్తు జూన్ 18వ తేదీలోగా చేసుకోవాలని కోరారు.

ఘనంగా దండు మారెమ్మ తిరుణాల

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్యమడుగులో వెలసిన శ్రీ దండు మారెమ్మ ఆలయంలో తిరుణాల ఘనంగా జరిగింది. కన్యమడుగు మర్రిమాకులపల్లె, ఎద్దుల వారి పల్లె గ్రామ ప్రజలు ఈ తిరుణాలను వైభవంగా నిర్వహించారు. పూజారి శంకర్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు. మహిళలు పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో అమ్మవారికి దీలు, బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందిని బండ్లు మరవని భక్తులను అలరింప చేశాయి. ఆశాది వారు ఆగం చెబుతూ ఆగంతో అమ్మవారిని మేల్కొల్పారు. కురవల్ల కోట మండలం అడవి పల్లెకు చెందిన పులివెందల కోర్టు న్యాయమూర్తి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో మొక్కలు తీర్చుకున్నారు అనంతరం న్యాయమూర్తి విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు ఆయు రారోగ్యాలతో పాడిపంటలతో కళకళలాడాలని న్యాయం ధర్మం నాలుగు పాదాల నడవాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు తెలిపారు. వారి వెంట శివశంకర్ రెడ్డి, నిర్మలమ్మ, రాజశేఖర్ రెడ్డి, పుష్పలత ఉన్నారు.

రుతుక్రమ సమయంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కిషోర్ బాలికలు, యువత నెలసరి రుతుక్రమ సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ వెంకటరామయ్య సూచించారు. మంగళవారం సిహెచ్‌సి ప్రభుత్వ ఆస్పత్రిలో ఋతు పరిశుభ్రత దినం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ తేజశ్రీ రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జాగ్రత్తలు పాటించినప్పుడే ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రిచర్డ్, వైద్య సిబ్బంది కిషోర బాలికలు, యువతులు పాల్గొన్నారు. **పీలేరు:** నెలసరి ఋతు క్రమం ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తలుపుల గ్రామంలో నిర్వహించిన ఋతు క్రమం ఆరోగ్యం, పరిశుభ్రతా దినోత్సం అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని తమ సిబ్బందితో కలిసి నిర్వహించారు. పీరియడ్స్ అనేవి స్త్రీ జీవితములో ఒక సహజమైన ప్రక్రియ అని, దాన్ని ప్రత్యేకంగా చూడకుండా మరింత అవగాహన పెంచుకోవాలని అన్నారు.నేటికీ 15 - 25 సంవత్సరాల మధ్య వస్సు మహిళల్లో నెలసరి శుభ్రతపై సరైన అవగాహన లేక దురద, ఫంగల్, మూత్రనాళ ఇన్ఫెక్షన్, ఇతర అంటు వ్యాధులు సోకి చివరికి సంతానోత్పత్తిపై తీవ్ర చెడు ప్రభావం పడే అవకాశం ఉందని చెప్పారు. నొప్పి, అసాధారణ రక్తస్రావం, ఇతర మార్పులుంటే తక్షణం దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత సలహాలు పొందాలని, మరిన్ని సందేహాలకు ఆశ, ఎఎన్ఎంలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఎఎన్ఎం నాగవేణి, ఆశ అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

పీలేరు: తలుపుల వైద్యాధికారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

లోతు దుక్కులతో అధిక దిగుబడి

- ◆ తొలకరి జల్లులు తర్వాత గొర్రు తిప్పి సేద్యం చేయాలి
- ◆ లోతు దుక్కులు...వానా కాలానికి అనుకూలం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో కొందరు రైతులు తమ పొలాల్లో దుక్కులు దున్నుకుంటున్నారు. ఈ సమయంలో దుక్కులు దున్నుకోవడం వల్ల నేల స్థూల సాంద్రత తగ్గటం జరుగుతుందని, నేలలో గాలి ప్రసవించే గుణం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. లోపలి పొరల్లో ఉన్న పోషకాలు నేల ఉపరితలానికి చేరి తర్వాత పంటకు లభ్యత పెరుగుతుందని, లోతుగా దున్నుకోవడం ద్వారా వాన నీరు భూమిలోకి ఇంకెందుకు అనుకూలంగా ఉండటంతో పాటు భూమి ఎక్కువ తేమను గ్రహించు కొని నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. దీని ప్రభావం తర్వాత పంట దిగుబడిపై చూపుతుందని, పంట కోత అనంతరం పంట అవశేషాలు సేంద్రియ కర్బనం అభివృద్ధి చెంది భూసారం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దీని ద్వారా నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి తర్వాత పంటకు వేసే ఎరువులు వినియోగ సామర్థ్యం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. వేసవిలో లోతుగా దుక్కులు దున్ని తొలకరి జల్లులు కురిసిన తర్వాత గొర్రు తిప్పి సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుందని చెప్పారు. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటక, నాగలి వంటి పరికరాలు నేల లోపలికి మూడు నుంచి ఆరు అంగుళాల వరకు చొచ్చుకు పోతాయని అన్నారు. ఈ పరికరాలు తరచూ ఉపయోగించడం వలన నేల లోపల సుమారు 3 నుంచి 5 అంగుళాల లోతులో ఒక గట్టి పొర ఏర్పడుతుంది. నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుందని అన్నారు. వేసవి దుక్కుల సమయంలో నేలను లోతుగా దున్నినప్పుడు ఈ గట్టి పొర చేదించబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుందని, దొంగ గరిక వంటి మొండి జాతి కలుపు మొక్కలు పొలంలో అధికంగా పెరిగి పంటలను నాశనం చేస్తుంటాయని అన్నారు. వేసవిలో దుక్కులు లోతుగా తీయడంతో పొలంలోని చీడలు నాశనమయ్యే అవకాశం ఉన్నందున రైతులు అధికారులు సూచనల మేరకు జాగ్రత్తలు పాటించాలని కోరుతున్నారు. పంటల కోతల తర్వాత నేలపై

దుక్కులు దున్నిన భూమి

మిగిలే పంట మొదలు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు పంటలనుంచి రాలి పడిన ఆకుల వంటి వివిధ సేంద్రియ పదార్థాలన్నీ లోతు దుక్కి దునినప్పుడు నేలలో కలిసి కుళ్ళిపోయి ఎరువుగా మారుతాయని అన్నారు. నేలలో సేంద్రియ పదార్థాలు, పోషక విలువలు పెరగటానికి అవ కాశం ఉంటుందని అన్నారు. లోతు దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటే వర్షా కాలానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పశువుల మందలు పొలానికి ఎంతో బలం

రైతులు వేసవిలో తమ పొలాల్లో పశువులు, గొర్రెల మందలు పెట్టుకుంటే మంచిది. పశువులు, గొర్రెలను పొలంలో మందలు కట్టడం రైతులకు పాత విషయమే. ఆ పని వేసవిలో చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పొలంలో మందలను కట్టిన సమయంలో మల, మూత్రాలు విసర్జిస్తాయి. దీంతో మనకు అవసరమైనంత ఎరువు లభించి పొలానికి అదనపు బలం చేకూరుతుంది.

అధిక దిగుబడులకు అవకాశం

దుక్కులను లోతుగా దున్నటం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వ్యవసాయ అధికారులు సూచనలు మేరకు పంటలు తగిన సమయంలో వేసి, తగిన రక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాగించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి

మదనపల్లి: ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లి

ఎన్‌టిఆర్ 101వ జయంతి వేడుకలను స్థానిక బెంగుళూరు బస్టాండ్ సమీపంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్ బాషా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి నాయకులు,కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా షాజహాన్ బాషా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల దిక్సూచి స్వర్గీయ నందమూరి తారక రామారావు అన్నారు. టిడిపిని స్థాపించి కేవలం ఆరు నెలల్లోనే అధికారం చేపట్టి చరిత్ర సృష్టించిన ఘనత ఎన్‌టిఆర్‌దేనని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపినాయకులు మోడెం సిద్దప్ప, ఎస్.ఎ.మస్తాన్, నాగూర్‌వలి, విజయమ్మ, నాదెళ్ల విద్యా సాగర్, నవీన్ కుమార్, గుత్తికొండ త్యాగరాజు, బాబు నాయుడు, రామకృష్ణ ఆచారి, షంషేర్, రామిశెట్టి నీలకంఠ, కమలామర్రి కృష్ణ, సుధాకర్, యర్రబల్లి వెంకట రమణారెడ్డి, బొమ్మిశెట్టి పురుషోత్తం పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను మంగళవారం స్థానిక జ్యోతి చౌక్ బస్టాండ్‌లో మాజీ సర్పంచ్ కుడుము శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి కీర్తిని ప్రపంచం నలుదిశల చాటిచెప్పిన మహానీయుడని మహిళలకు ఆస్తిలో సమభాగం హక్కు కల్పించిన గొప్ప వ్యక్తని కొనియాడారు. మహిళలు రాజకీయాల్లో రాణించినప్పుడే సమాజంలో ముందు ఉంటారనే ఉద్దేశంతో 26శాతం మహిళా రిజర్వేషన్ కల్పించారని కొనియాడారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆర్థిక చేయూత కల్పించిన ఘనత ఆయనేదనని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహని కార్యదర్శి పర్వీన్ తాజ్, పట్టణ అధ్యక్షుడు బంగారు వెంకటరమణ, ప్రసాద్, గంజి మోహన, మస్తాన్, సిద్ధారెడ్డి, శిల్ప అంజి పాల్గొన్నారు. **వీరబల్లి :** ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను 12 గ్రామాల్లో టిడిపి కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటిన నట సార్వభౌముడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలే ఆదర్శమై ఇప్పటికి సంక్షేమ పథకాలు గా కొనసాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, మట్లి సర్పంచ్ నాగార్జునచారి, సీనియర్ టిడిపి నాయకుడు రెడ్డప్పరెడ్డి, భాస్కర్‌రాజు, చాన్‌బాషా, నాగసుబ్బమ్మ, నరసింహులుమాదిగ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** రాజకీయాలలో ఆదర్శ ప్రాయలు టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి అన్నారు. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం టిడిపి నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్‌గౌడ్, కట్టా గుండయ్యానాయుడు, టివిరమణారెడ్డి, గడిగోట సుబ్బరాయుడు, బి.చలపతి, రవికుమార్‌రాజు, కల్లా చలపతి, వాసుదేవరెడ్డి, కమతం నాగరాజు, సుబ్రహ్మణ్యంనాయుడు, కొమ్మ శివ నవీన్,ేవామరాజ్, పి.మణి, నరసింహారెడ్డి, జోగినేని మణి, రాజశేఖర్, చంద్ర పాల్గొన్నారు. **రామసముద్రం :** విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 101 జయంతి వేడుకలను మంగళవారం చెక్‌పోస్ట్ కూడలిలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయస్ఫూర్తిని ప్రతి కార్యకర్త నెరవేర్చినప్పుడే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు.

తెలుగువారి కీర్తిని ప్రపంచంలోని నలుదిక్కులకు చాటిచెప్పిన మహానీయుడని మహిళలకు ఆస్తిలో పురుషులతో సమానంగా హక్కు కల్పించిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి, శివ శంకర, మాజీ మండల అధ్యక్షులు కృష్ణంరాజు, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్, డాక్టర్ శివ, ప్రశాంత్ కుమార్‌రెడ్డి, రామ్మూర్తి, వెంకటరమణ, కృష్ణమోహన్, రెడ్డిశేఖర్, రంగాని వెంకటేష్, సోమశేఖర్, పూలఆంజి, టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాయచోటి :** పేద, బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతూ, తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహానీయుడు నందమూరి తారక రామారావు అని రాయచోటి టిడిపి అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ 101వ జయంతి సందర్భంగా రాయచోటిలోని మండిపల్లి భవన్ లో యన్టీఆర్ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మాజీ మార్కెట్ చైర్మన్ రమేష్ రెడ్డి,రవీంద్రారెడ్డి, ఖాదర్, మోహిద్దీన్, ఇర్షాద్, జావిద్, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. **కలకడ:** నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళి అర్పించారు. **రామాపురం:** లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సీట్లు పంచిపెట్టారు. నీలకంఠరావుపేటలో ఉప సర్పంచ్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆగ్రో వెంకటరామిరెడ్డి, బంకు రామిరెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి, చెన్నూరి అన్నయ్య, చెన్నూరి బాబు, గుంట భాస్కర్‌నాయుడు, సుబ్బరా యుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి:** ఎన్‌టిఆర్101జయంతిని పురస్కరించుకుని అమర్నాథ్‌రెడ్డి భవన్ టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా పని చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా నిలిచిన వ్యక్తి ఎన్‌టిఆర్ మాత్రమేనని కొనియాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి మాజీ జడ్‌పిటిసి మాలతి, రహమతుల్లా, మాజీ ఎంపిటిసి జనార్దన్‌గౌడ్, నాయకులు సహదేవరెడ్డి, వేంపల్లి అబ్దుల్‌ఖాదర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు:** ఎన్‌టిఆర్ 101వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు రామారావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళామతల్లి ముద్దుబిడ్డ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడుగా రామారావు అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలిశెట్టి సురేంద్ర, మాజీ జడ్పిటిసి రెడ్డి బాష, పురం రామ్మూర్తి, కోటపల్లి శ్రీనాథ్ రెడ్డి, స్పోర్ట్స్ మల్లి, షౌకత్ అలీ, అత్తర్ చాను, చెన్నారెడ్డి, హరి, రమణ నాయక్ పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మండల కేంద్రంలో టిడిపి జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నార శ్రీనివాసులు, టిడిపి యువత ప్రధాన కార్యదర్శి రమేష్; జనసేన నాయకులు నాగూర్ వల్లి, ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఖాదర్ బాషా పాల్గొన్నారు. **ములకలచెరువు :** అన్ని రంగాలలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లి అభివృద్ధి బాటలో నడిపిన దివంగత నందమూరి తారక రామారావు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని తంబళ్లపల్లె టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లి జయ చంద్రారెడ్డి తెలిపారు. ములకలచెరువు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దివంగత నేత నందమూరి తారకరామారావు 101 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తంబాలపల్లి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త పోతుల సాయినాథ్, టిడిపి నియోజకవర్గ నాయకులు గిరిధర్ రెడ్డి, ములకలచెరువు మండలం టిడిపి అధ్యక్షులు పాలగిరి సిద్ధప్ప, తంబళ్లపల్లి మండల అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కెవి రమణ, రాష్ట్ర టిడిపి బిసి నాయకులు మౌలా, నియోజకవర్గ నాయకులు చిన్న కృష్ణ పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

తేక్వాండోలో బంగారు పతకాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఈనెల 3వ తేదీ నుంచి 6వ వరకు గోవాలో జరిగిన ఏడవ నేషనల్ తేక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు కాలింగట్, గోవాలో జరిగిన పోటీలలో అద్భుత ప్రతిభ కనబరచడం జరిగిందని ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠేశ్వరరావు తెలియజేశారు. రోహిత్ 50-54 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, ఎస్.సంతోష్‌రెడ్డి గోల్డ్‌మెడల్, జె.నికిత 55-59 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, ఎస్ జోష్ణ గోల్డ్ మెడల్, ఎస్.లహరి 50-54 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, టి.కార్తీక్ 30-34 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. రానున్న పోటీల్లో మరింత అద్భుత ప్రతిభ కనబరిచి ఇలాంటి మరెన్నో పథకాలు సాధించాలని కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, ఉపాధ్యాయ బృందం ద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

వాహన స్టార్టింగ్ సమస్య.. ఇబ్బందుల్లో 108 సిబ్బంది

ప్రజాశక్తి - ముద్దనూరు

అత్యవసర వేళల్లో ప్రజలకు వైద్య సేవలు అందించే 108 వాహనం సెల్ఫ్ పని చేయక స్టార్టింగ్ సమస్య తలెత్తింది. సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. అంబులెన్స్ స్టార్టింగ్ సమస్య వల్ల వ్యాను ఎత్తుగా ఉన్న ప్రదేశాల్లో నిలిపి టైర్ల కింద రాళ్లు పెట్టి నిలుపుకునే దుస్థితి ఏర్పడింది. 108 వాహనం సెల్ఫ్ స్టార్ట్ కాకపోవడంతో ప్రజల సాయంతో తోసుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. అంబులెన్స్ ఆగిపోతే ప్రజలు అందుబాటులో లేని ప్రదేశాల్లో మళ్లీ స్టార్ట్ చేయాలంటే సిబ్బందికి తీవ్ర అవస్థలు తపపడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించే 108 వాహనానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్దచెరువుకట్టపై తొలగిన వ్యర్థాలు, చెత్తా చెదారం

పెద్దచెరువుకట్టపై పారిశుధ్య పనులు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

'డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న పెద్దచెరువు కట్ట' అనే శీర్షికతో ఈనెల 18న ప్రజాశక్తి దినపత్రిలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ, సర్పంచ్ వెంకటాద్రి స్పందించి పెద్ద చెరువుకట్టపై ఉన్న వ్యక్తపదార్థాలను సిబ్బందితో చదును చేయించారు. ఇకపై చెరు కట్టపై వ్యర్థపదార్థాలు, చెత్తా చెదారాన్ని వేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న ప్రవీణ్

గాంధీనగర్ క్రికెట్ జట్టు విజయం

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్లో భాగంగా నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవ పల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటులో మంగళవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో పోలీసు జట్టు పై గాంధీనగర్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ జట్టు 14 ఓవర్లలో 140 పరుగులకు చేసింది. పోలీసు జట్టులో రాజంపేట డిఎస్‌పి విఎన్‌కె చైతన్య నాలుగు ఓవర్లు వేసి నాలుగు వికెట్లు తీశాడు. అనంతరం విజయం కోసం బరిలో పోలీసు జట్టు 14 ఓవర్లలో 115 పరుగులకు 9 వికెట్లను కోల్పోయి పరాజయం చెందింది. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ 41 పరుగులతో ఒంటరి పోరాటం చేసిన జట్టుకు విజయం అందించలేకపోయాడు. గాంధీనగర్ జట్టు ఆటగాడు 84 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు బాలాజీ శివశంకర్, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు ల చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందుకున్నారు.

సూపర్ ఓవర్‌లో మంటపంపల్లె జట్టు విజయ దుందుభి

మధ్యాహ్నం కింగ్స్ డాబా మంటపంపల్లి, ఫాల్కన్స్ అరవ పల్లె జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠ భరితంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన డాబా జట్టు 14 ఓవర్లలో 132 పరుగులకు 9 వికెట్లను కోల్పోయింది. అనంతరం 133 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన ఫాల్కన్ జట్టు 14 ఓవర్లలో 132 పరుగులు చేసింది. దీంతో ఈ మ్యాచ్ టై అయింది. అనంతరం ఆర్గనైజర్స్ సూపర్ ఓవర్ ఆడవలసిందిగా ఇరు జట్లకు సూచించారు. మొదటి సూపర్ ఓవర్లో ఫాల్కన్స్ జట్టు ఒక వికెట్ కోల్పోయి ఆరు పరుగులు చేసింది. అనంతరం కింగ్స్ డాబా జట్టు ఏడు పరుగులు చేసి విజయం సాధించింది. రెండు ఓవర్లు వేసి మూడు వికెట్లు తీసిన సాయి రెడ్డికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ను అందజేశారు. ఈ మ్యాచ్ కు జాతీయ వికలాంగ క్రికెట్ క్రీడాకారుడు శివకోటి, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు మున్న అంపేర్లుగా,స్కోరర్ గా అప్సర్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, రంజిత్ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-ములకలచెరువు

గ్రామాలలో ఎలాంటి ఘర్షలకు పాల్పడినా అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, మదనపల్లి డిఎస్‌పి ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ములకలచెరువు మండలం పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లుగా నమోదైన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు త్వరలో వెలువడు తుండడంతో గ్రామాలలో ప్రశాంతమైన వాతావరణం చోటు చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండాలన్నారు. గ్రామాల్లో చిన్నపాటి ఘర్షణలకు పాల్పడిన కేసులు నమోదుతో పాటు, కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిఎస్‌పి వెంట ట్రైనీ డిఎస్‌పి ప్రశాంత్, సిఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐ తిప్పే స్వామి, యేసయ్య, నజీర్‌బాషా పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి-రామాపురం

ఎస్‌పి కృష్ణారావు

ఎన్నికల కౌంటింగ్ రోజున జూన్ 4న గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కృష్ణారావు లక్కి రెడ్డిపల్లి సిఐ, రామాపురం ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌పి కృష్ణారావు మంగళవారం రాత్రి రామాపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా కట్టుదిడమైన ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ రోజున గ్రామాలలో శాంతిభద్రత లకు విఘాతం కలిగించే వారిని గుర్తించి అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. **చిన్నమండెం :** స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి కృష్ణారావు సందర్శించారు. ఎన్నికల ఫలితాలు రోజున చట్ట వ్యతిరేక విధానాలను అనుసరించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని స్థానిక ఎస్ఐను ఆదేశించారు.

క్రైం కార్నర్

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మండలంలో ఆదివారం రాత్రి రంగసముద్రం వద్ద బైకు అదుపుతప్పి పడ్డ ప్రమాదంలో గాయపడిన భవన కార్మికుడు మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. కర్ణాటకలోని రాయల్పాడు సమీపాన ఉండే రోనూరుకు చెందిన బీరప్ప(36) బి.కొత్తకోట పట్టణంలో ఇళ్లు అద్దెకు తీసుకొని స్థానికంగా భవన నిర్మాణం పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. పిటిఎం నాగన్నకోటకు పనికి వెళ్లి, సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా, రంగసముద్రం వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వబోయి బైక్ అదుపుతప్పి పడి తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. కుటుంబీకులు బాధితున్ని చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బీరప్ప మృతి చెందాడు. పిటిఎం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మరో వ్యక్తి..

రామాపురం: మండలం బండపల్లి పంచాయతీ గన్నీదా వద్ద ఈ నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నూలి వెంకటరమణ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వీరబల్లి మండలం, సాని పాయి గ్రామం కృష్ణవారిపల్లికి చెందిన నూలి వెంకటరమణ అలియాస్ బుజ్జి(47) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. గాయపడిన వెంకటరమణ తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి కారకుడైన కరెంట్ స్తంభాల కాంట్రాక్ట్ బలరాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.